నమస్తే తెలంగాణ


మెదక్

13 హైదరాబాద్, సోమవారం 29 జనవరి 2024 MEDAK




బీఆర్ఎస్ ఇన్సూరెన్స్ చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి

# మెదక్‌లో ఎగిరేది గులాబీ జెండానే..



- వచ్చే ఎంపీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడాలి
- 100 రోజుల్లో కాంగ్రెస్ పార్టీ హామీలు నెరవేర్చాలి
- మెదక్ నిధులు వెనక్కి వెళితే ఎమ్మెల్యే ఏం చేస్తున్నారు..?
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- కేసీఆర్ హయాంలో అన్ని రంగాల అభివృద్ధి
- మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

జిల్లా కేంద్రంలో నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం

మెదక్, జనవరి 28 (నమస్తే తెలంగాణ) : 'కార్యకర్తలు అధైర్యపడొద్దు.. పార్టీ మీకు అండగా ఉంటుంది... చీకటి తర్వాత వెలుగు వస్తుంది... ఓటమి తర్వాత గెలుపు దక్కుతుంది... మెదక్‌లో గులాబీ జెండా ఎగురవేస్తాం.' అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వైస్రాయ్ గార్డెన్స్‌లో మెదక్ నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశం బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌ను ప్రారంభించడానికి కేసీఆర్ వచ్చినప్పుడు మెదక్ పట్టణానికి రూ.50 కోట్లు, రామాయంపేట మున్సిపాలిటీకి రూ.25 కోట్లు, ఏడుపాయల అభివృద్ధి కోసం రూ.100 కోట్ల నిధులను కేటాయించారు. ఇప్పుడు ఆ నిధులన్నీవెనక్కి వెళ్లాయని, ఇక్కడున్న ఎమ్మెల్యే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లో చేస్తామన్న పనులు చేయలేదని, రైతు బంధు ఇవ్వలేదని ఎండగడుతూ రీల్స్ చేసి యువత సోషల్ మీడియాలో పెట్టాలని యువకులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తూ చర్చ పెట్టాలన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే సరిపోదని రూ.500లకే గ్యాస్ సిలిండర్, మహిళలకు రూ.2500 ఇచ్చినప్పుడే ఆ పథకం పూర్తవుతుందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచైనా ఇచ్చిన హామీలను నెరవేర్చే విధంగా పోరాటం చేస్తామన్నారు. ఆనాడు కేటీఆర్ రాష్ట్ర అభివృద్ధి కోసం దావోస్‌కి వెళ్తే దండగ అన్నారు.. ఇప్పుడు మీరు దావోస్‌కి వెళ్తే పండగ అని మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఝూటా మాటలు, అబద్ధం ప్రచారం చేస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షాల మీద దాడి మానుకోవాలని, ఆరు గ్యారెంటీల హామీల మీద దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు ధాన్యాన్ని అమ్ముకోవద్దని, బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకముందే బోనస్, రెండు లక్షల రుణమాఫీ, పింఛన్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్చి 17 వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తవుతుందని అప్పట్లోగా వారిచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలన్నారు.

**దళితుల ఉసురుపోసుకుంటున్న కాంగ్రెస్...**

దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో దళిత బంధు ప్రవేశ పెట్టి వారి అకౌంట్లో డబ్బులు వేస్తే వాటిని ఫ్రీజ్ చేసి దళితుల ఉసురుపోసుకున్నారని హరీశ్‌రావు అన్నారు. గొల్లకురుమలు కట్టిన డీడీలు తిరిగి ఇవ్వకుండా, గొర్రెలు పంపిణీ చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక బాధ్యత, హూందాతనం పెరగాలి కానీ ఆ కుర్చీని కించపరిచే విధంగా ఇంకా ప్రతిపక్షంలో ఉన్నామనేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కర్ణాటకలో గెలిచి ఎనిమిది నెలలైనా 6 గ్యారెంటీలను అమలు చేసే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మార్పు వచ్చిందని.. మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలుతున్నాయని, వైరింగ్ దుకాణాలు, ఇన్వర్టర్, జనరేటర్ షాపులు అందుబాటులోకి వచ్చాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ ఫైల్ మీద సంతకం పెడతామని, రెండు నెలలైనా అమలు చేయలేదన్నారు. రుణమాఫీ చేయకుండా పార్లమెంట్ ఎన్నికలకు పోతే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఓట్లు వేస్తారా అని ప్రశ్నించారు. 24 గంటల కరెంటు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఇప్పుడు రోజుకు 14 గంటలే ఇస్తుందన్నారు. ఆనాడు రైతులకు రైతుబంధు వేస్తే కాంగ్రెస్ పార్టీ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేసిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆర్. సత్యనారాయణ, మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మెదక్ నియోజకవర్గంలోని పట్టణ, మండలాల పార్టీ అధ్యక్షులు గంగాధర్, అంజాగౌడ్, నాగరాజు, మహేందర్ రెడ్డి, రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఎంపీపీలు శేరి నారాయణ రెడ్డి, యమున జయరాంరెడ్డి, సిద్ధిరాములు, చిన్నశంకరంపేట్ జడ్పీటీసీ మాధవి రాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలి**

**– బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి**



ఎన్నికల్లో గెలుపు, ఓటములు సహజమని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. మొన్న జరిగిన ఎన్నికల్లో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని, ఎవరూ వెనుకడుగు వేయకుండా చిన్న ఆటంకంగా భావించి ముందుకు దూసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ప్రతిపక్షాలు చెప్పిన మాయ మాటలు, నెరవేర్చని హామీలు అన్నీ ప్రజల ముందుకు తీసుకువెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చే పరిస్థితిలో కాంగ్రెస్ లేదన్నారు. రెండు నెలల్లోనే ప్రజలకు ఈ విషయం అర్థమైందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ ఉన్నప్పుడే రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించిందని, ప్రజలకు మేమున్నామనే భరోసా ఇస్తూ ముందుకు వెళ్లారని గుర్తు చేశారు.



మెదక్ సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



కొమురవెల్లి మల్లికార్జున స్వామి మూల విరాట్

# శిగమూగిన లష్కర్

**లష్కర్ వారానికి పోటెత్తిన భక్తజనం**

మల్లన్నను దర్శించుకున్న 50 వేల మంది భక్తులు

ఉదయం 5గంటల నుంచే క్యూలైన్





బోనం ఎత్తుకున్న మహిళ



కొమురవెల్లి ఆలయ గంగరేగు చెట్టు వద్ద భక్తుల మొక్కులు

చేర్యాల, జనవరి 28 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో రెండో ఆదివారం లష్కర్‌వారం సందర్భంగా మల్లన్న క్షేత్రానికి భక్తులు భారీగా తరలివచ్చారు. హైదరాబాద్‌తో పాటు కరీంనగర్, మెదక్, వరంగల్ ఉమ్మడి జిల్లాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. మల్లన్న స్వామి మమ్మేలు అంటూ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. శనివారం సాయంత్రం నుంచే ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాల్లో భక్తులు మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయ పరిధిలో దాతల గదులు ఖాళీగా లేకపోవడంతో ప్రైవేటు గదులు కిరాయికి తీసుకుని బస చేశారు. ఆదివారం వేకువ జామునే నిద్రలేచి కోనేటిలో స్నానాలు ఆచరించి క్యూలో వెళ్లి మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. అభిషేకం, అర్చన, ఒడి బియ్యం, కొబ్బరి కాయలు, పట్నాలు, బోనాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి 50వేల మంది భక్తులు వచ్చినట్లు ఆలయ ఈవో బాలాజీ తెలిపారు.

**వేకువజామునే ప్రారంభమైన దర్శనాలు**

వేకువజామున 5 గంటల నుంచే స్వామివారిని దర్శించుకునేలా ఆలయవర్గాలు తగిన ఏర్పాట్లు చేశాయి. ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం, ధర్మదర్శనం తదితర కౌంటర్లను తెరిచి టిక్కెట్లను విక్రయించారు. అనంతరం గుట్టపై ఉన్న ఎల్లమ్మను దర్శించుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, ఏఈవో గంగా శ్రీనివాస్, సూపరింటెండెంట్ నీల శేఖర్, ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఒగ్గు పూజారులు, సిబ్బంది భక్తులకు సేవలందించారు.



పట్నం వేసి మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

# కమనీయం.. గోదా రంగనాథస్వామి కల్యాణం

**హాజరైన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

అందోల్, జనవరి 28 : పట్టణంలోని ప్రాచీన భూనీల సమేత రంగనాథస్వామి ఆలయంలో ఆదివారం నిర్వహించిన గోదారంగనాథస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఉదయం దేవతా మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన నిర్వాహకులు పట్టు వస్త్రాలతో కల్యాణానికి సిద్ధం చేశారు. వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకాగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కల్యాణంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రికి నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగిన ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. రంగనాథ స్వామి జాతర రథం కోసం అవసరమైన ఆర్థిక సాయం అందజేస్తానన్నారు. రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతి సైతం కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, హరికృష్ణగౌడ్, చెందర్‌నాయక్, దుర్గేశ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశం, మాజీ సర్పంచ్ కృష్ణారెడ్డి, నాయకులు ప్రదీప్‌గౌడ్, సారశివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రంగనాథస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న మంత్రి దామోదరరాజనర్సింహ

# జాతీయస్థాయి క్రీడలకు సిద్దిపేట క్రీడాకారులు

**జూనియర్ విభాగంలో ఇద్దరు విద్యార్థులు ఎంపిక**

**వచ్చే నెల 1 నుంచి 4వ తేదీ వరకు బాచుపల్లిలో పోటీలు**



రాష్ట్ర జూనియర్ కబడ్డీ బాలికల జట్టుకు ఎంపికైన మాధవి



రాష్ట్ర జూనియర్ కబడ్డీ బాలుర జట్టుకు ఎంపికైన లారెన్



రాష్ట్ర కబడ్డీ జట్టు మేనేజర్‌గా ఎంపికైన కుంటనోళ్ల శివకుమార్

గజ్వేల్ అర్బన్, జనవరి 28: త్వరలో జరుగనున్న జాతీయ జూనియర్ కబడ్డీ బాల బాలికల జట్లకు సిద్దిపేట జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సీ సంతోష్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల గజ్వేల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్రం తరపున ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. బాలికల విభాగంలో సిద్దిపేట జిల్లాకు చెందిన మాధవి (రైట్‌కవర్), బాలుర విభాగంలో లారెన్( రైడర్) ఎంపికయ్యారన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమారన్ను రాష్ట్ర జట్లకు మేనేజర్‌గా నియమించినట్లు తెలిపారు. జిల్లాకు ఇంతటి గౌరవం దక్కినందుకు క్రీడాకారులను ప్రధాన కార్యదర్శి కుంటనోళ్ల శివకుమార్‌ను అభినందించారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌యాదవ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఎంపికైన క్రీడాకారులు హైదరాబాద్ బాచుపల్లిలో ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరుగనున్న జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొంటారని వివరించారు. ఎంపిక పట్ల జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, వైస్ చైర్మన్ జుబేర్‌పాషా, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, జిల్లా కోశాధికారి సత్యం, ఉపాధ్యక్షులు రాజు, రమేశ్, ప్రేమ్ నారాయణ, రంగనాథ్, సంయుక్త కార్యదర్శులు మహేశ్, శ్రీకాంత్, నరేంద్రబాబు, కరుణాకర్, కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



సింగూరు ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

# సింగూరులో బోటింగ్ సందడి

మునిపల్లి, జనవరి 28 : మండల పరిధిలోని బుసారెడ్డిపల్లి గ్రామ శివారులోని సింగూరు ప్రాజెక్టులో ఆదివారం బోటింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సింగూరు ప్రాజెక్టును చూసేందుకు వచ్చిన పర్యాటకులు బోటింగ్ చేసేందుకు ఆసక్తి చూపడంతో సింగూరు ప్రాజెక్టు ప్రాంతం అంతా సందడిగా మారింది. ఆదివారం నుంచి సింగూరు ప్రాజెక్టులో ప్రతి రోజు పర్యాటకులకు బోటింగ్ అందుబాటులో ఉంటుందని, చిన్నపిల్లలకు బోటింగ్ అనుమతి లేదని నిర్వాహకులు తెలిపారు.



# ఇచ్చిన మాటను నిలబెట్టుకోని కాంగ్రెస్

- రైతు రుణమాఫీ జాడలేదు.. 500 బోనస్ ఊసే లేదు.
- సర్పంచులు గర్వించేలా అభివృద్ధి పనులు
- బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి
- నూతన పంచాయతీ భవనాల ప్రారంభోత్సవంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి, జనవరి 28: కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ప్రకటించిన హామీలు అమలు చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతా లక్ష్మారెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని రాయిలాపూర్, జాజీ తండాల్లో నిర్మించిన పంచాయతీ భవనాలను మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేండ్లలో సర్పంచులు గౌరవంగా, గర్వంగా, తలెత్తుకునేలా అభివృద్ధి పనులు చేశారన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే పల్లెల్లో అభివృద్ధి జరిగిందన్నారు. కౌడిపల్లి మండలంలో కొత్తగా ఏర్పడ్డ అన్ని పంచాయతీలకు భవనాలు నిర్మించుకున్నట్లు తెలిపారు. మండలంలో రూ.13.88 కోట్ల రీబీటింగ్ పనులకు మూడు పనులు పూర్తి చేసుకుని, ఏడు ప్రగతిలో ఉన్నాయన్నారు. డిసెంబర్ 9న రెండు లక్షల రైతు రుణమాఫీ ఏమైందని, 50 రోజులకు పైగా కాలం గడుస్తున్నా రైతు భరోసా, రైతులకు బోనస్ ఇవ్వలేదని, ప్రభుత్వం దాటవేస్తున్నదని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో నర్సాపూర్ నియోజకవర్గానికి రూ.250 కోట్లకు పైగా వివిధ అభివృద్ధి పనులు మంజూరు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఎంపీపీ రాజు నాయక్, జడ్పీటీసీ సభ్యురాలు కవిత అమర్‌సింగ్, రాయిలాపూర్ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్ కుర్మ శేఖులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, ఎంపీటీసీ సారా స్వప్నా కిశోర్‌గౌడ్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గుంజరి ప్రవీణ్‌కుమార్, పీఆర్ డిప్యూటీ ఈఈ అమరేశ్వర్, ఏఈ ప్రభాకర్, సర్పంచులు రమేశ్‌నాయక్, ఎల్లం, లావణ్యామోహన్, పద్మాకిష్టయ్య, చంద్రశేఖర్‌గుప్తా, సంజీవ్, తునికి, ఆలయ కమిటీ డైరెక్టర్లు అంజాగౌడ్, దొంతుల దుర్గయ్య, సంతోష్, పీఏసీఎస్ డైరెక్టర్లు రాయగిరి, మల్లేశం, నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**సింగిల్ ఫేజ్ మోటర్ ప్రారంభం**

నర్సాపూర్, జనవరి 28 : మున్సిపల్‌లోని 6వ వార్డులో నీటి సమస్యను తీర్చడానికి మదర్సా భవనం వద్ద సింగిల్ ఫేజ్ మోటర్‌ను ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయీమొద్దీన్, నాయకులు లాయక్ ఆలీఖాన్, సత్యంగౌడ్, ముజాహిద్ ఖాన్ పాల్గొన్నారు.




కౌడిపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి